## 'హోదా'కు తానా స్వాగతం

డల్లాస్ : తెలుగు భాషకు ప్రామాణిక/ ప్రాచీన హోదా కల్పించడాన్ని ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ (తానా) తాత్కాలిక అధ్యక్షుడు జయరామ్ కోమటి, కార్యదర్శి ప్రసాద్ తోటకూర ఆహ్వానించారు. ఒక సంయుక్త ప్రకటన చేస్తూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రపంచంలోని తెలుగువారందరికీ అత్యంత విలువైన, చారిత్రాత్మకమైన బహుమతి ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. మన మాతృభాషకు ఎట్టకేలకు ప్రాచీన హోదా కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి తానా కార్యవర్గం, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషకు ఈ హోదా దక్కడం వెనుక ఎందరో రచయితలు, సాహిత్యకారులు, వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల కృషి ఉందని వారు గుర్తు చేసుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, అధికార భాషా సంఘం, ప్రామాణిక భాషల టాస్క్‌ఫోర్స్ కమిటీ తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం చేసిన కృషి ప్రశంసనీయం అన్నారు. మన మాతృ భాషకు ప్రాచీన హోదా తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జయరామ్ కోమటి, ప్రసాద్ తోటకూర తమ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు భాషకు ప్రామాణిక / ప్రాచీన హోదా కోసం తానా సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన కార్యక్రమాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలుగు భాషకు హోదా కోసం 2007వ సంవత్సరంలో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లోలోను, హైదరాబాద్‌లోను ర్యాలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ క్రమంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడిని ఆహ్వానించినట్లు తెలిపారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం కృషి చేస్తామని వారిద్దరి నుంచి హామీ తీసుకున్నట్లు వివరించారు. అంతే కాకుండా తానా సంస్థ నుంచి ప్రత్యేకంగా ఒక ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళి సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీమతి అంబికా సోనీని కలిసి మెమొరాండం సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

అమెరికాలోని మిచిగాన్ విశ్వవిద్యాలయంలోను, ఆస్టిన్‌లో యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌లోను తెలుగు కోర్సులను ఏర్పాటు చేయడంలో తానా సంస్థ సఫలీకృతమైనట్లు జయరామ్ కోమటి, ప్రసాద్ తోటకూర తమ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాలోని తెలుగు యువతరానికి తెలుగు భాషను బోధించేందుకు తానా సంస్థతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చాయని వారు తెలిపారు. ప్రామాణిక భాష హోదా వచ్చిన సందర్భంగా ఇప్పుడు తెలుగు భాషను మన పిల్లలకు ఇంటి దగ్గర, పాఠశాలల్లోను చదివించడం, చెప్పించడం, తెలుగు భాషను పరిరక్షించుకోవడం మనందరి తక్షణ కర్తవ్యం, బాధ్యత అని జయరామ్ కోమటి, ప్రసాద్ తోటకూర తమ ప్రకటనలో ప్రపంచంలోని తెలుగువారందరికీ విజ్ఞప్తి చేశారు.